# మావోయిస్టు దంపతుల లొంగుబాటు

## భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ ఎదుట సరెండర్డ్



లొంగిపోయిన మావోయిస్టు దంపతుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, మే 30: మావోయిస్టు పార్టీ కాలం చెల్లిన సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయిన ఆ పార్టీకి చెందిన దంపతులు పోలీస్ శాఖ ఎదుట లొంగిపోయినట్లు భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీపీఐ మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతగుప్ప గ్రామానికి చెందిన మడకం లింగా అలియాస్ రాఖేశ్, అదే ప్రాంతానికి చెందిన మడివి గంగి అలియాస్ సునీత ఇద్దరూ సీఆర్‌పీఎఫ్ 81వ బెటాలియన్, 141 బెటాలియన్ అధికారులు, భద్రాద్రి పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయినట్లు వెల్లడించారు. లింగా మిలీషియా కమాండర్ ఎర్రా సమక్షంలో 2009లో మావోయిస్టు పార్టీలో చేరాడు. 2010లో మిలీషియా సభ్యుడిగా పనిచేసిన అనంతరం 2014లో అప్పటి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్ ప్రొటెక్షన్ టీమ్‌కు బదిలీ అయ్యాడు. అనంతరం అదే సంవత్సరం పదోన్నతి పొంది మణుగూరు ఏరియా ఎల్‌ఎస్‌జీ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. అదేవిధంగా గంగి 2011లో చర్ల మిలీషియా కమాండర్ పొడియం జయరాం సమక్షంలో నిషేధిత మావోయిస్టు పార్టీలో చేరి 2013 వరకు చైతన్య నాట్య మండి (సీఎన్‌ఎం) సభ్యురాలిగా పనిచేసింది. అనంతరం 2014 వరకు చర్ల ఏరియా మిలీషియా సభ్యురాలిగా చేసి అదే సంవత్సరం హరిభూషన్ ప్రొటెక్షన్ టీమ్‌లో చేరి 2018లో మండకం లింగాను వివాహం చేసుకుంది. లింగా, గంగి దంపతులు మావోయిస్టు పార్టీలో అగ్రనాయకులు పెడుతున్న వేధింపులు తాళలేక, ఆ పార్టీ సిద్ధాంతాలపై విసుగు చెంది స్వేచ్ఛా జీవనాన్ని గడిపేందుకు వచ్చి పోలీస్ శాఖ ఎదుట లొంగిపోయారు.

**జనజీవన స్రవంతిలోకి రావాలి: ఎస్పీ**

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమానికి ఆకర్షితులై ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 17 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ఎస్పీ రోహిత్ రాజు వివరించారు. నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు డిప్యూటీ కమాండర్లు, ఐదుగురు ఏరియా కమిటీ సభ్యులు, ఐదుగురు దళ సభ్యులు, ఐదుగురు మిలీషియా సభ్యులు లొంగిపోయారని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛను కోరుకునే మావోయిస్టులు నిర్భయంగా జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. లొంగిపోవాలనుకునే మావోయిస్టులు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌నుగానీ, జిల్లా ఉన్నతాధికారులనుగానీ, లేదా దగ్గరి బంధువులు, స్నేహితుల ద్వారాగానీ తమను ఆశ్రయించవచ్చని తెలిపారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని ప్రతిఫలాలను అందించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.

# ఆదివాసీ గ్రామాల్లో ఆధ్యాత్మిక జ్యోతి వెలగాలి

- త్రిదండి చిన్నజీయర్‌స్వామి
- 165 జంటలకు సామూహిక వివాహాలు



సామూహిక వివాహ కార్యక్రమంలో పాల్గొన్న జంటలు

మణుగూరు టౌన్, మే 30 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలో ఆదివాసీ 165 జంటలకు త్రిదండి చిన్నజీయర్‌స్వామి పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా సామూహిక వివాహాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి వికాస తరంగిణి, దానధర్మట్రస్ట్ సహకారం అందించగా, చిన్నజీయర్‌స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో వధూవరులకు పట్టువస్త్రాలు, మంగళ సూత్రం, మెట్టెలు, శ్రీరామచంద్రమూర్తి ప్రతిమను ఉచితంగా అందించారు. సాధారణ వివాహాల్లో జరిగే తంతుతోపాటు వధువుతో వరుడి మెడలో శ్రీరామచంద్రుడి ప్రతిమను కట్టించారు. ప్రతి జంటను ఆశీర్వదించిన అనంతరం చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ ఆదివాసీ ప్రజల్లో ఆధ్యాత్మిక జ్యోతి వెలిగించి, వారికి హిందూ సంప్రదాయం తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఒక్కో జంటకు రూ.60 వేల ఖర్చు అయిందని మొత్తం రూ.30 లక్షల విలువ చేసే మంగళసూత్రాలు కొనుగోలు చేశామన్నారు. దీనికి సహరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

**ఆధ్యాత్మకతతోనే మానసిక ప్రశాంతత**

అన్నపురెడ్డిపల్లి, మే 30 : ఆధ్యాత్మకతతోనే మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందని త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. తొలుత చిన్న జీయర్ స్వామికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దంపతులు, పురోహితులు స్వాగతం పలికారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

**జడ్పీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు**



జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

భద్రాద్రి కొత్తగూడెం, మే 30 (నమస్తే తెలంగాణ) : రైతన్నలు నకిలీ విత్తనాల వల్ల రూ.లక్షల్లో నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు జిల్లా వ్యవసాయ అధికారులను కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు కావాల్సిన అన్నిరకాల విత్తనాలను డిమాండ్‌కు సరిపోయే విధంగా మార్కెట్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.

# 'నకిలీ'ల ఏరివేతకు ప్రత్యేక నిఘా

- విత్తనాలు విత్తేందుకు అదును, పదును చాలా ముఖ్యం
- సాగుకు సరిపడా విత్తనాలు: సిద్ధం ఖమ్మం డీఏవో విజయనిర్మల



విత్తన షాపుల్లో తనిఖీలు చేస్తున్న డీఏవో విజయనిర్మల

ఖమ్మం రూరల్, మే 30: నకిలీ విత్తనాల ఏరివేతకు పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని ఖమ్మం డీఏవో విజయనిర్మల తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకునేందుకు వ్యాపారులు ప్రయత్నం చేస్తే కఠిన చర్యలకు బాధ్యలవుతారని స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామంలోని ఎరువులు, విత్తనాల షాపుల్లో గురువారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. షాపుల్లోని స్టాక్, విత్తన కంపెనీల వివరాలు, ధరలు, రకాల బోర్డుల ప్రదర్శన తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఏరకం విత్తనాలు అడిగితే ఆ రకం విత్తనాలను మాత్రమే ఇవ్వాలని సూచించారు. అందుకు బదులుగా వేరే రకం విత్తనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే, రైతులందరూ షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు వాటితోపాటు బిల్లులు కూడా తీసుకోవాలని, పంటలు చేత్తికి వచ్చే వరకూ వాటిని జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు.

**సరిపడా విత్తనాలు..**

అలాగే, జిల్లాలో సాగుకు సరిపడేలా అన్ని రకాల విత్తనాలు పుష్కలంగా ఉన్నాయని డీఏవో తెలిపారు. వానకాలం సాగుకు అవసరమైన మేర విత్తనాల గురించి అంచనా వేసి వాటిని అందుబాటులో ఉంచామన్నారు. ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లైసెన్సులు చెల్లుబాటులో ఉన్న డీలర్లు మాత్రమే విత్తనాలు విక్రయించాలని, వారు కూడా కేవలం ఎంఎన్‌సీ కంపెనీల విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. అలాగే, రైతులు కూడా విత్తనాలను తీసుకునే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూమిలో సరిపడా పదును ఉన్నప్పుడు మాత్రమే విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. అదును, పదును లేని సమయంలో విత్తనాలు విత్తితే అవి చనిపోతాయని అన్నారు. ఫలితంగా రైతులు నష్టపోయే ప్రమాదముందని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రాజు, వీ నాగేశ్వరరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కిన్నెరసానిలో ముగిసిన సమ్మర్ క్యాంపు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థు

పాల్వంచ రూరల్, మే 30 : గత పదిహేనురోజులుగా కిన్నెరసాని క్రీడా పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంపు గురువారం ముగిసింది. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఈ సమ్మర్ క్యాంపును మే 16 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ఆరు జిల్లాల నుంచి వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన 60మంది బాలురు, 60 బాలికలను ఎంపిక చేసి సమ్మర్ క్యాంపు నిర్వహించారు. వీరిలో ప్రతిభ చూపిన వారికి జాతీయ స్థాయి గిరిజన క్రీడలకు ఎంపిక చేస్తారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్ పాల్గొని జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి విజయాలు సాధించాలని, ఉపాధి కోసం క్రీడలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో క్రీడల అధికారి బొల్లి గోపాల్‌రావు, ఇతర క్రీడా ఉపాధ్యాయులు వెంకటనారాయణ, ఎస్.నాగేశ్వరావు, బి. రాంబాబు, వెంకటేశ్వర్లు, రామారావు, రాంబాబు, నాగమణి, బాపనమ్మ, రవి, నాగరాజు, వాసు, మరెప్ప, ప్రసాద్, దివ్య, హెచ్‌ఎం చందు పాల్గొన్నారు.

# బైక్‌పై చలివేంద్రం

**విశ్రాంత ఉద్యోగి వినూత్న ఆలోచన**

**బాటసారుల దాహార్తి తీరుస్తున్న దుర్గారావు**



బండిపై చల్లటి తాగునీటిని అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగి

కొత్తగూడెం టౌన్, మే 30 : ఓ విశ్రాంత ఉద్యోగి వినూత్న ఆలోచన పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది. వేసవికాలంలో వివిధ పనుల నిమిత్తం జిల్లాకేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు వినూత్న రీతిలో చలివేద్రం ఏర్పాటు చేశాడు. తన ద్విచక్రవాహనంపై రెండువైపులా నాలుగు కూల్‌వాటర్ క్యాన్లను కట్టి ముందు ఒక ఫ్లెక్సీ కట్టారు. కొత్తగూడెం పట్టణంలో జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో రోజంతా తిరిగి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. తాగునీరే కాకుండా నిమ్మరసం, మజ్జిగ కూడా ఉచితంగా అందిస్తున్నారు. ఇలా వేసవికాలం అంతా చేస్తానని చెబుతున్న కొత్తగూడేనికి చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగి చింతపల్లి దుర్గారావును ప్రతిఒక్కరూ మెచ్చుకోవాల్సిందే.

## వాణిజ్య



### నెట్‌ఫ్లిక్స్‌తో వొడాఫోన్ ఐడియా జట్టు

న్యూఢిల్లీ, మే 30: టెలికం సేవల సంస్థ వొడాఫోన్ ఐడియా..వీడియో స్ట్రీమింగ్ సేవల సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో జట్టు కట్టింది. తన కస్టమర్లకు ఎంటర్‌టైన్‌మెంట్ సేవల పరిధిని మరింత విస్తరించడంలో భాగంగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం రెండు సరికొత్త ప్రీ-పెయిడ్ ప్లాన్లను సైతం ఆవిష్కరించబోతున్నది. యూజర్లు తమకు నచ్చిన మొబైల్, టెలివిజన్ లేదా ట్యాబ్లెట్‌లో ఈ సరికొత్త స్ట్రీమింగ్ సదుపాయం పొందవచ్చునని తెలిపింది. ఇందుకోసం వొడాఫోన్ ఐడియా రెండు ప్రీపెయిడ్ ప్లాన్లను ఆవిష్కరించింది. ఈ ప్లాన్లలో అన్‌లిమిటెడ్ కాల్స్, డాటా పొందవచ్చునని తెలిపింది. దీంట్లో 70 రోజుల కాలపరిమితి కలిగిన రూ.999 ప్లాన్‌లో రోజుకు 1.5 జీబీ డాటాతో పాటు 100 ఎస్ఎంఎస్/రోజుకు, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్ చేసుకోవచ్చును. అలాగే 84 రోజుల కాలపరిమితితో విడుదల చేసిన ప్లాన్‌లో రోజుకు 2.5 జీబీ డాటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, అన్‌లిమిటెడ్ వాయిస్, నెట్‌ఫ్లిక్స్ బేసిస్(టీవీ లేదా మొబైల్) పొందవచ్చును. ఈ ప్లాన్ చార్జీ రూ.1,399గా నిర్ణయించింది.

# తిండి కోసం దిక్కులు!



- 16 ఏండ్ల కనిష్ఠానికి నిల్వలు
- ఆరేండ్ల తర్వాత దిగుమతులకు గ్రీన్‌సిగ్నల్?
- నిల్వలున్నాయని ఇటీవల కేంద్రం అబద్ధాలు

**దిగుమతులు లేనిదే గడవని దుస్థితికి దేశం**

**అమాంతం పడిపోయిన గోధుమల ఉత్పత్తి**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): యావత్తు ప్రపంచ దేశాలకు ఆహారాన్ని ఎగుమతి చేసే స్థాయికి దేశాన్ని తీసుకుపోతామని గప్పాలు కొట్టిన కేంద్రంలోని మోదీ సర్కారు గడిచిన పదేండ్లలో దేశాన్ని ఆకలి భారతంగా మార్చింది. తిండి కోసం విదేశాల వైపు దీనంగా చూసే దుస్థితికి తీసుకొచ్చింది. నిన్న మొన్నటివరకూ ఉల్లి, కందిపప్పు, వంట నూనె, టమాట, చక్కెర వంటి నిత్యావసరాల కోసం దిగుమతులను ఆశ్రయించిన భారత్.. ఇప్పుడు గోధుమల కోసమూ దిక్కులు చూసే దుస్థితికి దిగజారింది. ఆరేండ్ల తర్వాత గోధుమ దిగుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుండటమే దీనికి నిదర్శనం.

**నిల్వలు అథఃపాతాళానికి**

గోధుమల ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు అదే గోధుమల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన దురవస్థ దాపురించింది. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వెరసి హర్యానా, పంజాబ్, యూపీ, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో గోధుమల దిగుబడి భారీగా తగ్గినట్టు పారిశ్రామికవర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది 112 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర గోధుమ ఉత్పత్తి ఉంటుందని కేంద్రం అంచనా వేసినప్పటికీ, 6.25 శాతం మేర ఉత్పత్తి పడిపోనున్నట్టు తెలుస్తున్నది. ఇదే సమయంలో ఏప్రిల్‌నాటికి గోదాముల్లో నిల్వలు 7.5 మిలియన్ మెట్రిక్ టన్నులకు క్షీణించాయి. ఇది 16 ఏండ్లలోనే కనిష్ఠం. దీంతో రష్యా వంటి దేశాల నుంచి ఆరేండ్ల తర్వాత గోధుమలు దిగుమతి చేసుకోవాలని కేంద్రం యోచిస్తున్నది. ఈ క్రమంలో గోధుమల దిగుమతులపై ఉన్న 40 శాతం సుంకాన్ని ఎత్తివేయాలనుకొంటున్నది. ఈ మేరకు జూన్‌లో నిర్ణయం ఉండొచ్చని అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్' ఓ కథనంలో వెల్లడించింది.

**నిల్వలు ఉన్నాయని ఏమార్చి..**

దేశీయంగా నిల్వలు తగ్గిపోతుండటంతో 2022లో గోధుమల ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. అయితే, కొరతను దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ చర్యలను మాత్రం చేపట్టలేదు. దీంతో గోధుమల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సేకరించే గోధుమల నిల్వలూ పడిపోయాయి. ఇదే విషయమై గత జనవరిలో వివిధ పత్రికల్లో వార్తలు వచ్చాయి. అయితే, ఎఫ్‌సీఐ వద్ద తగినన్ని నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చెప్పుకొచ్చారు. స్థానిక వ్యాపారులకు 6 మిలియన్ మెట్రిక్ టన్నుల గోధుమలను కేంద్రం సరఫరా చేసిందని, నిల్వలు లేకుంటే ఇదెలా సాధ్యమని ఉదహరించారు. విదేశాల నుంచి దిగుమతులు దిగుమతి చేసుకొనే అవసరమే లేదని పేర్కొన్నారు.

**ఎన్నికల్లో ప్రయోజనం కోసమే..**

నిజానికి జనవరి 1నాటికి గోదాముల్లో 16.47 మిలియన్ మెట్రిక్ టన్నుల గోధుమలు మాత్రమే ఉన్నాయి. ఈ స్థాయిలో నిల్వలు పడిపోతే దేశంలో ఆహార సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉన్నది. దీంతో అప్పుడే గోధుమల దిగుమతులు మొదలు పెట్టాలి. అయితే, విదేశాల నుంచి ఎక్కువ ఖర్చుపెట్టి గోధుమలను దిగుమతి చేసుకొంటే రైతుల నుంచి వ్యతిరేకత ఎదురవ్వొచ్చని, ఇది ఎన్నికలపై ప్రభావం చూపే ప్రమాదమున్నదని కేంద్రంలోని బీజేపీ సర్కారు భావించిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకనే సరిపడా నిల్వలు ఉన్నట్టు, దిగుమతులు అవసరమే లేదని కేంద్రమంత్రులతో అబద్ధాలు వల్లెవేయించిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కొరతను నివారించడానికి దిగుమతులకు తలుపులు బార్లా తెరువబోతున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# అటు రిలయన్స్.. ఇటు టాటా

న్యూఢిల్లీ, మే 30: టైమ్స్ ప్రతిష్ఠాత్మకంగా ప్రకటిస్తున్న ప్రపంచంలోనే 100 అత్యంత ప్రభావశీల సంస్థల జాబితాలో భారత్ నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా గ్రూప్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌లు చోటు దక్కించుకున్నాయి. ఈ ఏడాదికిగాను విడుదలైన ఈ లిస్టులో రిలయన్స్, టాటాలు.. టైటాన్ కేటగిరీలో స్థానం పొందాయి. రిలయన్స్‌కు ఈ గౌరవం దక్కడం ఇది రెండోసారి. 2021 జాబితాలోనూ ఉన్నది. కాగా, ఈ సందర్భంగా రిలయన్స్‌ను 'ఇండియా'స్ జాగర్‌నట్'గా టైమ్ అభివర్ణించడం గమనార్హం. అప్రతిహతంగా రిలయన్స్ అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నదని టైమ్స్ ప్రశంసించింది. కరోనా వ్యాక్సిన్‌ను తయారు చేసిన సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు పయనీర్ కేటగిరీలో చోటు లభించింది. ఈ లిస్టులో 100 కంపెనీలను మొత్తం 5 కేటగిరీల్లో విభజించగా.. లీడర్స్, డిస్‌రప్టర్స్, ఇన్నోవేటర్స్ విభాగాలూ ఉన్నాయి. ఇది టైమ్స్ నాల్గో జాబితా. ప్రభావం, కొత్తదనం, లక్ష్యం, విజయాల ప్రాతిపదికన ఆయా సంస్థలకు లిస్టులో చోటు దక్కింది.






# బ్యాంకింగ్ మోసాలు పెరిగాయ్

**గత ఆర్థిక సంవత్సరం 47 శాతం ఎక్కువయ్యాయని ప్రకటించిన ఆర్బీఐ**

**రూ.78,213 కోట్లకు బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు**





ముంబై, మే 30: ఈ ఏడాది మార్చి ఆఖరుతో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశీయ బ్యాంకింగ్ రంగంలో మోసాలు 46.7 శాతం పెరిగాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించింది. గురువారం విడుదల చేసిన రిజర్వ్ బ్యాంక్ వార్షిక నివేదిక ప్రకారం నిరుడు ఏప్రిల్ మొదలు ఈ మార్చి చివరిదాకా మొత్తం 36,075 మోసాలు జరిగాయి. అంతకు ముందు ఏడాది కాలంలో 13,564 మోసాలే నమోదయ్యాయి. అయితే ఈసారి ఈ మోసాల విలువ రూ.13,930 కోట్లుగానే ఉన్నది. 2022-23లో మాత్రం రూ.26,127 కోట్లుగా ఉన్నట్టు ఆర్బీఐ గణాంకాలు చెప్తున్నాయి. ఇక ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఎక్కువగా చిన్నపాటి కార్డ్/ఇంటర్నెట్ మోసాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మాత్రం లోన్ పోర్ట్‌ఫోలియోల్లోనే అధికంగా మోసాలకు పాల్పడ్డారు.

**రూ.78,213 కోట్లకు..**

ఈ మార్చి ఆఖరు నాటికి బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల విలువ రూ.78,213 కోట్లకు పెరిగినట్టు ఆర్బీఐ తమ తాజా నివేదికలో తెలిపింది. ఏడాది క్రితం రూ.62,225 కోట్లేనన్న ఆర్బీఐ.. గత ఆర్థిక సంవత్సరం 26 శాతం పెరిగినట్టు చెప్పింది. సహకార బ్యాంకులుసహా దేశంలోని అన్ని బ్యాంకుల్లో పదేండ్లు, ఆపై కాలంగా ఖాతాదారులు తమ ఖాతాల నుంచి తీసుకోని డిపాజిట్లే ఇవన్నీ. వీటిని ఆర్బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌కు బదిలీ చేస్తున్నారు. కాగా, సదరు డిపాజిట్ల సెటిల్మెంట్ల కోసం వాటికి చెందిన ఖాతాదారులను లేదా వారి వారసులు, నామినీలను వెతకాలని బ్యాంకులకు ఆర్బీఐ సూచిస్తున్నది. ఇక గత ఆర్థిక సంవత్సరం ఆర్బీఐ బ్యాలెన్స్ షీట్ పరిమాణం 11.08 శాతం పెరిగి రూ.70.47 లక్షల కోట్లకు చేరిందని, అందుకే కేంద్ర ప్రభుత్వానికి మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో రూ.2.11 లక్షల కోట్లను డివిడెండ్‌గా ప్రకటించామని ఆర్బీఐ తెలిపింది.

**ఆర్బీఐ వార్షిక నివేదిక ముఖ్యాంశాలు**

- ఈ ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ 7 శాతంగా నమోదు కావచ్చని అంచనా.
- గత ఆర్థిక సంవత్సరం రూ.27,000 కోట్ల సావరిన్ గోల్డ్ బాండ్లను కొన్న మదుపరులు.
- రిజర్వ్ బ్యాంక్ వద్ద 822.10 మెట్రిక్ టన్నుల బంగారం.
- ప్రధాన ద్రవ్యోల్బణం మరింత పెరగవచ్చు. ఇదే జరిగితే ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభావం ఉంటుంది.
- ఈ ఏడాది మార్చి 31 నాటికి చలామణిలో ఉన్న కరెన్సీలో 86.5 శాతానికి చేరిన రూ.500 నోట్ల వాటా.
- విదేశాల్లో రూపీ అకౌంట్లను తెరిచేందుకు అనుమతి.